ప్రజాశక్తి

సోమవారం 6 నవంబర్ 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

వేడెక్కిన ఓట్ల రాజకీయం

- ముగిసిన ప్రత్యేక శిబిరాలు
- ప్రత్యర్థుల ఓట్ల తొలగింపునకు వైసిపి సన్నాహాలు
- ఎదుర్కొనేందుకు నిశిత పరిశీలనలో టిడిపి



ప్రత్యేక శిబిరాల్లో భాగంగా గుంటూరులో పరిశీలిస్తున్న అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాలపై ప్రధాన రాజకీయపార్టీలు దృష్టి సారించాయి. ఎన్నికల్లో గెలుపునకు సర్వశక్తులు ఒడ్డుతున్న ప్రధాన రాజకీయపార్టీలు ఓటర్ల జాబితాలపై నిశిత పరిశీలన చేస్తున్నారు. గుంటూరు,పల్నాడు జిల్లాల పరిధిలో 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాలపై టిడిపి, వైసిపి వ్యూహ ప్రతి వ్యూహాలను అమలు చేస్తున్నారు. ఓటర్ల ముసాయిదా జాబితాపై స్పెషల్ క్యాంపెయిన్‌లో భాగంగా శని, ఆదివారాల్లో రెండు జిల్లాల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మార్పులు, చేర్పులు, తొలగింపులపై వచ్చే దరఖాస్తులను వెంటనే పరిష్కరించేలా బిఎల్‌ఒలు ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నారు.

పలు పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న స్పెషల్ క్యాంపె యిన్‌ను ఏఈఆర్‌ఒలు, సూపర్‌వైజరీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన స్పెషల్ క్యాంపుల్లో ప్రజల నుండి నూతన ఓటుకై దరఖాస్తులు, ఓటర్ కార్డులో చిరునామా, పేరు, పుట్టిన తేది తదితర మార్పులకు దరఖాస్తులు అందాయి. వీటితో పాటు వేర్వేరు కారణాలతో తొలగింపునకు ఫారం-7 కూడాపెద్ద సంఖ్యలో దాఖలు చేశారు. వీరిలో స్థానికంగా ఉండటం లేదని, పలువురు మృతి చెందారని, బోగస్ ఓటర్ల పేరుతో వైసిపి నాయకులు భారీగా దరఖాస్తులు అందిస్తున్నారని, తమ పార్టీ ఓట్లు తొలగిస్తున్నారని టిడిపి నాయకులు ఆరోపించారు. గత రెండు రోజుల్లో గుంటూరులో దాదాపు రెండు వేలకు పైగా ఫారం-7 దరఖాస్తులు అందించారని తెలిసింది. వీటిల్లో వైసిపి నాయకులు వారి పార్టీ కార్యకర్తల చేత సమర్పించినవి ఎక్కువగా ఉన్నట్టు తెలిసింది. నగరంలోని ఒక వైసిపి నాయకులు మహిళల చేత దరఖాస్తులు చేయించినట్టు కూడా విమర్శలు వచ్చాయి. జనసేన, టిడిపికి బలమైన సామాజిక తరగతులకు చెందిన వారిని ఎక్కువగా తొలగిస్తున్నారని పలువురు టిడిపి నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఒకే రోజు 858 ఫారం-7 అందాయని తెలిసింది. వీటిల్లో వైసిపి వారు 663, టిడిపి 100కిపైగా ఇచ్చినట్టు తెలుస్తోంది. గుంటూరు బ్రాడీపేటలో పోలింగ్ బూత్ 140 పరిధిలో ఒకే సామాజిక తరగతికి చెందిన 23 ఓట్ల తొలగింపునకు దరఖాస్తులు సమర్పించారు. జెకెసి కళాశాల రోడ్డులోని నవభారత్‌నగర్‌లో ఒక అపార్టుమెంట్‌లో 30 ఓట్లు ఉండగా వీటిల్లో 12 ఓట్లు తొలగించాలని వైసిపి కార్యకర్త వెంటరెడ్డి ఫారం -7 కొంతమంది వ్యక్తులు సమర్పించారని టిడిపి నాయకులు తెలిపారు. ఫారం -7 దరఖాస్తు చేసిన వారి వివరాలను తెలుసుకునే పనిలో టిడిపి నాయకులు నిమగ్నం అయ్యారు. వీటిపై ఆరా తీయగా ఒక వైసిపి నాయకుని సూచన మేరకు దరఖాస్తులు ఇచ్చామని సంబంధిత వ్యక్తులు తెలిపారు. గుంటూరు తూర్పులో 250 వచ్చాయి. తెనాలి, మంగళగిరి, వినుకొండ,గురజాల, సత్తెనపల్లి, మాచర్లలో ఫారం-7 దరఖాస్తులు వందల సంఖ్యలో వచ్చాయని సమాచారం.



విలేకర్లతో మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్

రేపు పల్నాడుకు సిపిఎం బస్సు యాత్ర

- సత్తెనపల్లిలో ప్రజారక్షణ భేరి బహిరంగ సభ
- జయప్రదం చేయాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ పిలుపు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన సత్తెనపల్లి పట్టణంలోని తాలూకా సెంటర్లో నిర్వహించే ప్రజారక్షణ భేరి సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రచార జాతా పల్నాడు జిల్లాకు మంగళవారం వస్తుందని చెప్పారు. ఈ మేరకు స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, రామాయపట్నం పోర్ట్ పనులు, రాజధాని నిర్మాణం, రైల్వే జోన్ తదితర విభజనా హామీల్లో ఏ ఒక్కటీ కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదని, రాష్ట్రాన్ని నిలువునా మోసం చేసిందని, పైగా విశాఖ ఉక్కును తెగనమ్మటానికి సిద్ధమైందని విమర్శించారు. తామేమి తక్కువ తినలేదు అన్నట్లు రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఆరాచాక పాలన సాగిస్తోందన్నారు. ముఖ్యమంత్రి కేవలం కార్పొరేట్ సేవలో తరిస్తున్నారని చెప్పారు. ప్రజా సమస్యలను గాలికొదిలేశారని, విద్యుత్, పన్నుల భారం మోపారని అన్నారు. పంటలను కాపాడుకోవడానికి రైతులు వేల రూపాలు ఖర్చుచేసి దూరాబారం నుండి నీరు పెట్టుకుంటున్నారని, జల పథకం క్రింద రైతులకు ఉచిత బోర్లు వేస్తామని చెప్పిన ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. పొలాలన్నీ సాగవ్వని కారణంగా గ్రామాల్లో కూలి పనులు తగ్గాయని, ఉపాధి హామీ పనులైనా కల్పించడం లేదని అన్నారు. మరోవైపు ధరలు, విద్యుత్ ఛార్జీలు, పన్నులు పెంచి చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఈ విధానాలన్నింటిపైనా సిపిఎం పోరాడుతోందని, అందులో భాగంగా నిర్వహించే బస్సు యాత్రను, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు డి.విమల, పి.మహేష్, నాయకులు వి.తులసిరామ్, జె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులు, విద్యార్థులకు విరివిగా రుణాలు

- రూ.6048 కోట్లకు పెరిగిన టర్నోవర్
- నాలుగేళ్లలో రూ.30 కోట్ల లాభాల్లోకి జిడిసిసి బ్యాంకు
- ప్రజాశక్తితో బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు

8లో

8న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

పోస్టర్ ఆవిష్కరణలో విద్యార్థి, యువజన సంఘాలు

4లో

ఉ(ఎ)త్తిపోతలు పథకాలు

- 60 లిఫ్ట్ ఇరిగేషన్లు ఉన్నా దక్కని చుక్కనీరు
- నాలుగేళ్లుగా మరమ్మతులకు గుర్తై మూలన
- సాగునీరందక ఎండిపోతున్న మిర్చి పైరు
- సిఎం మాట ఇచ్చినా నేటికీ నీటిమూటే



నిరుపయోగంగా ఉన్న పసుమర్రు వద్ద ఎత్తిపోతల పథకం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఎత్తిపోతల పథకాల సంఖ్య చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఉన్నా వాటి నుండి చుక్కనీరైనా రావడం లేదు. ఒకప్పుడు పొలాలను సస్యశ్యామలం చేసిన పథకాలు నాలుగేళ్ల తరబడి నిర్వహణ లోపం కారణంగా నేడు నిరుపయోగంగా మారాయి. ఒకవైపు ఎండిపోతున్న పైర్లు రైతులకు కన్నీళ్లు తెప్పిస్తుంటే మరోవైపు నీళ్లివ్వకుండా పథకాలు వెక్కిరిస్తున్నాయి.

చిలకలూరిపేట మండలంలోని యడవల్లి, బొప్పుడి, పురుషోత్తమపట్నం, కావూరు, చిలకలూరిపేటతోపాటు గణపవరంలో 30 వరకూ ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. నాదెండ్ల, యడ్లపాడు మండలాల్లో మరో 30 వరకూ ఉన్నాయి. వీటికింద గతంలో 40 వేల ఎకరాల వరకూ ఆరుతడి పంటలకు సాగునీరు అందేది. వీటి నుండి నీరు అందకుంటే ప్రత్యామ్నాయంగా ఉపయోగించుకోవడానికి మండలంలోని కొండ్రుపాడు చెరువు, కోటమ్మా చెరువు, కల్లంపల్లి చెరువు, రావెలకుంట చెరువు, కొనాయి కుంట తదితర పెద్ద చెరువులూ ఉన్నాయి. వీటి ద్వారా 13 వేల ఎకరాల ఆరుతడి పంటలకూ పుష్కలంగా నీరు అందేది. ప్రస్తుతం ఎత్తిపోతల పథకాలన్నీ మరమ్మతులకు లోనవగా, చెరువులు ఆక్రమణలకు గుర్తై నీటి నిల్వలకు దూరమయ్యాయి. ఫలితంగా పొలాలు బీళ్లుగాను, పైర్లు ఎండు మెక్కలుగానూ మారుతున్నాయి.

ఈ పరిస్థితుల నేపథ్యంలో ఎత్తిపోతల పథకాల కింద పొలాల్లోని పైర్లన్నీ ఎండిపోతున్నాయి. యడవల్లి, మద్దిరాల, వేలూరులో గతంలో

2లో



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా

బస్సు యాత్రలపై టిడిపి దుష్ప్రచారం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వైసిపి నిర్వహిస్తున్న సామాజిక సాధికారిక బస్సు యాత్రలపై టిడిపి నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ ముస్తాఫా అన్నారు. ఆదివారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గుంటూరులో శనివారం సాయంత్రం జరిగిన బస్సు యాత్రలో జనం లేరని టిడిపి నాయకులు చేస్తున్న ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. సభ ముగిసిన తరువాత వారికి అనుకూల మీడియా సంస్థలతో ఫొటోలు తీయించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమం నాలుగు గంటల పాటు జరగగా ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యాని, ఇది ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఏ సభ జరిగినా ముగింపు దశలో ప్రజలకు బయటకు వెళ్లడం సహజమని, దీనిని జనం రాలేదన్న భావనతో ప్రచారం చేయడం ఏ మేరకు సబబని ప్రశ్నించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రెండు కిలోమీటర్లకుపైగాభారీ ర్యాలీ జరిగిందని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి నూరి ఫాతిమా అన్నారు. బస్సు యాత్రకు వేలాదిమంది అభిమానులు వచ్చారని అన్నారు.

ఫొటోగ్రాఫర్లపై దాడికి ఎస్ఎఫ్ఐ ఖండన

ప్రజాశక్తి-గుంటూరు

అధికార పార్టీ గుంటూరులో శనివారం నిర్వహించిన సామాజిక, సాధికార బస్సు యాత్ర సభలో రెండు దిన పత్రికల ఫొటోగ్రాఫర్లపై భౌతిక దాడి చేయటం అప్రజాస్వామికమని, హేయమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. ఈ దాడి పత్రికా స్వేచ్ఛను హరించటమేనని, ఇందుకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

జగన్ సిఎంగా కొనసాగడం అవసరం

ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరిధర్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పేదలకు సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సిఎం జగన్ కొనసాగడం అవసరమని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ అన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి క్యాంపు కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు క్లస్టర్-4 ముఖ్య నేతల సమావేశం ఆదివారం జరిగింది. సమావేశానికి క్లస్టర్-4 అధ్యక్షుడు బి.రవీంద్రనాథ్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో రానున్నవి ఆషామాషీ ఎన్నికలు కాదని, పేదల పక్షాన వైయస్ జగన్ ఒక్కరే నిలబడితే.. పెత్తందారుల తరుపున మిగిలిన పార్టీలన్నీ దండుకట్టి దండయాత్రకు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. గెలుపును లక్ష్యంగా చేసుకుని సుశిక్షితులైన సైనికుల్లా ప్రతి ఒక్కరూ పోరాటానికి సన్నద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.దేవానంద్, క్లస్టర్-5 అధ్యక్షుడు బి.రంగారెడ్డి, కార్పొరేటర్లు మార్కెట్ బాబు, ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), మాజీ కార్పొరేటర్ ఉడతా కృష్ణ, నాయకులు కరుణాకర్‌రెడ్డి, బుజ్జి పాల్గొన్నారు.

ఆదర్శ పంచాయతీ నిర్మాణంలో మహేశ్వరరెడ్డి కృషి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్




మహేశ్వరరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సింహాద్రి మహేశ్వరరెడ్డి ఆశయాలను, లక్ష్యాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, సీనియర్ నాయకులు జైవి రాఘవులు అన్నారు. మండలంలోని కాజా సిపిఎం కార్యాలయంలో సింహాద్రి మహేశ్వరరెడ్డి 13వ వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళు లర్పించారు. అనంతరం నిర్వహించిన సభకు టి.ప్రసాద్‌రెడ్డి అధ్యక్షత వహించారు. అప్పారావు మాట్లాడుతూ గ్రామంలో 50 ఏళ్ల పాటు గ్రామ పంచాయతీని ఆదర్శంగా నిలపడంతో మహేశ్వరరెడ్డి ఎంతో కృషి చేశారని చెప్పారు. యువతను ఐక్యం చేయడానికి అనేక కార్యక్రమాలను నిర్వహించేవారని, సంక్రాంతి సందర్భంగా యువతను సమీకరించడంలో ఆయన పాత్ర కీలకంగా ఉండేదని గుర్తు చేశారు. ప్రస్తుత రాజకీయాలపై మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక నిత్య అవసరాల ధరలను విపరీతంగా పెంచిందన్నారు. సామాన్యుల జీతాలు మాత్రం పెరగడం లేదని ఆకాశాన్ని అందుతున్న ధరలతో ఆర్థిక సంక్షోభంతో పేదల జీవితాలు దుర్భరంగా తయారవుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని అన్నారు. మణిపూర్ దారుణాలపై కేంద్రం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపికి రాష్ట్రంలోని అధికార ప్రతిపక్షాలతో పాటు జనసేన అంటకాగుతున్నాయని దుయ్యబట్టారు. ప్రత్యేక హోదా ఇవ్వని, విభజన హామీలు అమలు చేయని, రాజధాని, పోలవరానికి నిధులివ్వని, కడప ఉక్కుకు సహకారం అందించని బిజెపికి ఆ మూడు పార్టీలు ఎందుకు వంతపాడు తున్నాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యుత్ బిల్లులు విపరీతంగా పెంచారని ట్రూఅప్, సర్ ఛార్జీల పేరుతో భారాలు మోపుతున్నారని అన్నారు. వీటికి వ్యతిరేకంగా పాలకులకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. జెవి రాఘవులు మాట్లాడుతూ 9వ తేదీన కాజాకు సిపిఎం బస్సు యాత్ర రానున్నదని, 15న తేదీన విజయవాడలో ప్రజారక్షణ భేరి బహిరంగ సభ ఉంటుందని, వీటిని జయప్రదం చేయాలని కోరారు. సభలో నాయకులు అధ్యక్షత వహించారు. బి.కోటేశ్వరి, ఈదా ప్రతాపరెడ్డి, ఆదిశేఖర్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మధుమేహంతో గుండెపోటుకు ముప్పు

డాక్టర్ గుండం శివ శ్రీనివాసరెడ్డి



ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

దీర్ఘకాల మధుమేహ బాధితుల్లో నాడులు న్యూరోపతికి గురి కావడం వల్ల గుండెపోటు వచ్చినా పెద్దగా నొప్పి తెలియదని ఫలితంగా నిశ్శబ్దంగా మరణిస్తారని నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ గుండం శివశ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రపంచ మధుమేహ నిరోధక మాసం సందర్భంగా సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ (ఎస్‌హెచ్‌ఒ) హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఆదివారం బ్రాడీపేటలోనీ ఎస్‌హెచ్‌ఒ భవనంలో నిర్వహించిన గుండెజబ్బుల శాస్త్రీయ అవగాహన సభ, ఉచిత వైద్య శిబిరానికి ఎస్‌హెచ్‌ఒ అధ్యక్షులు డాక్టర్ టి.సేవకుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ శివశ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మధుమేహాన్ని అదుపులో ఉంచకపోతే గుండె, రక్తనాళాల వ్యవస్థపై ప్రభావం చూపి, అధిగ రక్తపోటుకు, రక్తనాళాలు సన్నబడి రక్త సరఫరాలకు అంతరాయం కలిగించడం, చివరకు గుండెపోటుకు దారితీయడం వంటి పరిణామాలు సంభవిస్తాయన్నారు. రక్తంలో హెచ్‌డిఎల్, ఎల్‌డిఎల్ కొలెస్ట్రాలను పరీక్షించుకొని హెచ్చుతగ్గులను చూసుకోవాలన్నారు. అధిక రక్తపోటును నియంత్రణలో ఉంచుకోకుంటే గుండె గదులు పెద్దవై గుండె ఫెయిల్యూర్‌కు కారణం అవుతాయని వివరించారు. ముందు జాగ్రత్తలతో గుండె జబ్బుల్ని నిరోధించాలని, క్రమం తప్పని వ్యాయామం, ఆహార నియమాలు పాటించడం, మానసిక ఒత్తిడి, ఆందోళనలకు దూరంగా ఉండటం ద్వారా గుండె సంబంధ వ్యాధుల్ని చాలావరకు నిరోధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయరెడ్డి, ఎస్‌హెచ్‌ఒ మేనేజర్ పి.నిర్మల రాణి, మనవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పి.రమేష్, వి.సుబ్రమణ్యం, టి.వి. సాయిరాం, లక్ష్మి సామ్రాజ్యం, శివాజీ, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఇఎన్‌టి సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-గుంటూరు

వృద్ధాప్యంలో సహజంగా వచ్చే చెవి, ముక్కు, గొంతు సమస్యల పట్ల నిర్లక్ష్యం తగదని, సమస్య చిన్నదిగా ఉన్నప్పుడే వైద్యుని సంప్రదించాలని ఎన్‌టి సర్జన్ డాక్టర్ ఎస్.రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో చెవి, ముక్కు గొంతు సమస్యలపై నిర్వహించిన ఆరోగ్య సభకు టివి సాయిరామ్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. డాక్టర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మనిషి శరీర భాగాల్లో చెవి విషయాలను గ్రహించటంలో ముఖ్యపాత్ర పోషిస్తుందని, చెవిలో మూడు పొరలు ఉంటాయని, చెవికి సంబంధించి ముఖ్యంగా బ్యాక్టీరియల్, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు వస్తాయని చెప్పారు. చెవిలో బడ్స్‌గానీ, ఏ ఇతర పరికరాలు పెట్టి గుబిలి తీసే ప్రయత్నం చేయకూడదని, అలా చేస్తే గుబిలి మరింత లోపలికి వెళ్లే ప్రమాదం ఉందని అన్నారు. డాక్టర్ సలహాతోనే మందులు వాడాలని సూచించారు. చెవి నుండి మెదడుకు వెళ్లే నరాల సమస్య వల్ల, చెవిలో ఎముకలు దెబ్బతినటం వల్ల వినికిడి సమస్య వస్తుందన్నారు. రెండో కారణానికి మెషిన్ల ద్వారా ఇబ్బందిని తొలగించొచ్చని, ఇటీవల కాలంలో అధునాతన పరికరాలు వచ్చాయన్నారు. వినికిడి పరికరాలు ఎదుటి వారికి కనబడే విధంగా ఉంటే ఇబ్బందిగా భావించే వారి కోసం మైక్రో లెవల్ పరికరాలు వస్తున్నాయని, అయితే అవి కొంచె ఖరీదుగా ఉంటాయని చెప్పారు. ప్రస్తుతం ఐదేళ్లలోపు పిల్లలకు కాగ్నియర్ ఇంప్లాంటేషన్ శస్త్ర చికిత్స ప్రభుత్వం ఉచితంగా చేయిస్తుందన్నారు. ముక్కుకు సంబంధించి ఒక్కరిలో ముక్కులో అడినాయిడ్స్ ఉంటాయని, అవి వయస్సు పెరిగినకొద్దీ తొలిగిపోతాయని, ముక్కులో దూలంలా వకటి ఉంటుందని అది సహజసిద్ధంగాగానీ ప్రమాదవశాత్తుగానీ వంకరగా మారితే శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తి శరీరంలోనికి ఆక్సిజన్ సరిపడా అందక కొత్త సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. గురుక సమస్య కూడా వస్తుందన్నారు. గొంతులో టాన్సిల్స్ ఉంటా యని, ఇవి చిన్న వయస్సులో శరీరానికి రక్షణ వ్యవస్థలా పనిచేస్తా యని, తర్వాత శరీరానికి యాంటీ బాడీస్ ఉత్పత్తి సామర్థ్యం వస్తుందని, దీంతో టాన్సిల్స్ అవే తొలగిపోతాయని, లేకుంటే శస్త్రచికిత్స ద్వారా తొలగిస్తామని తెలిపారు. మరీ పెద్దగా గానీ, మరీ చిన్నగాగానీ మాట్లాడటం మంచిదికాదని, సాధారణ స్థాయిలో మాట్లాడటం మంచిదని సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఎం.వి.ప్రసాద్, బి.వి.రావు, వేమన ట్రస్ట్ అధ్యక్షులు సిహెచ్.అంజిరెడ్డి పాల్గొన్నారు.



చిలకలూరిపేట ప్రాంతంలో నీరు లేక ఎండిపోతున్న మిర్చిపైరు

ఉ(ఎ)త్తిపోతలు పథకాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎత్తిపోతల పథకాల మీద ఆధారపడే మాగాణి సాగు చేసినా అవి మరమ్మతులకు గురవడంతో కొన్నేళ్లుగా మాగాణి సాగు నిలిపేశారు. చిలకలూరిపేటలో రెండు ఎత్తిపోతల పథకాలుండగా ఒంగోలు బ్రిడ్జికి సమీపంలోని పథకం కింద 2800 ఎకరాలు, పసుమర్రు పథకం కింద 3 వేల ఎకరాలు సాగయ్యేవి. ఇవి మూడేళ్లుగా పనిచేయడం లేదు. ఎత్తిపోతల పథకాలన్నీ పనిచేయకున్నా గతేడాది వరకూ వర్షాధారంగా రైతులు పంటలు సాగుచేస్తూ వచ్చారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావం నేపథ్యంలో సమస్యలు తలెత్తాయి. ఎత్తిపోతల పథకాలకు నీరందించే నక్కవాగు, ఓగేరు వాగు, కుప్పగంజి వాగుల్లో నీరున్నా వాటిని ఎత్తిపోతల పథకాల ద్వారా పొలాలకు మళ్లించడం సాధ్యమవడం లేదు. యంత్రాలు పాడవడం, విద్యుత్ సరఫరాలో సమస్యలు, పైపుల లీకేజీ కారణంగా నాలుగేళ్ల నుండి ఎత్తిపోతల పథకాలేవీ పని చేయడం లేదు. చెరువుల నిర్వహణలో లోపాలూ నీటి నిల్వలను కుదించాయి. ఇవన్నీ రైతులకు శాపాలుగా మారాయి.

గతేడాది మిర్చికి మంచి ధర రావడం, సీజన్ తొలినాళ్లలో వర్షాలు పడడంతో మండలంలో 3 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేపట్టారు. మిర్చికి నెలకు కనీసం ఒకటి లేదా రెండు తడులు నీరు అవసరం. నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరిలోనూ నీటి తడులు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఈ పైరంతా ఇప్పుడు నీరందక ఎండుముఖం పట్టింది.

ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రారంభించే రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాన్ని చిలకలూరిపేట ప్రాంతంలో ప్రారంభించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఎత్తిపోతల పథకాల మరమ్మతులు విషయమై స్థానిక మంత్రి విన్నవించారు. నిధుల మంజూరుకూ ఆయన హామీనిచ్చినా ఇంకా అమలు కాలేదు. మరోవైపు మరమ్మతులు విషయమై ఇప్పటికే అధికారులకు పలుమార్లు అంచనాలు ఇచ్చామని, రూ.కోటి కేటాయిస్తే అన్నింటినీ వినియోగంలోకి తేవొచ్చని వైసిపికి చెందిన 15 వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు చెబుతున్నారు.



వివరాలు తెలుసుకుంటున్న ఇఆర్ఓ

పోలింగ్ స్టేషన్ల సందర్శన

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి అర్బన్ ప్రాంతంలో ఉన్న 45, 46, 47, 48 పోలింగ్ స్టేషన్లను ఆదివారం ఇఆర్ఓ సందర్శించారు. ఓటర్ల నమోదుతో పాటు మార్పులు, చేర్పులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బి.శివారెడ్డి, డిప్యూటీ ఎంఆర్ఓ తదితరులు పాల్గొన్నారు.

పంపింగ్ స్కీమ్ పరిశీలన

ప్రజాశక్తి-తాడేపల్లి



పంపింగ్ స్కీమ్‌ను పరిశీలిస్తున్న రాజశేఖరరెడ్డి.

ఆంధ్ర రత్న పంపింగ్ స్కీమ్ కాలువను ఆదివారం రామచంద్రా పురం వద్ద గుంటూరు పార్లమెంట్ తెలుగు రైతు విభాగం అధ్యక్షులు కళ్లం రాజశేఖరరెడ్డి, తెలుగు రైతు విభాగం అధికార ప్రతినిధి అక్కినేని సుబ్రహ్మణ్యం, నందిబోయిన శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ పూడుకుపోయిన కాలువను బాగు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కాలువ ద్వారా నీరు పారుదల చేయించి చివరి పొలాలకు కూడా నీరు అందించాలని కోరారు. రైతులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు.



నోట్‌బుక్స్ అందజేస్తున్న నాయకులు

హాస్టల్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి

పట్టణంలోని తెనాలి రోడ్డులో గల సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు ఎఐఎస్ఎఫ్ నాయకులు ఆదివారం పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఎఐఎస్ఎఫ్ కో-కన్వీనర్ అభిషేక్, వార్డెన్ రామారావు వీటిని అందించారు. నాయకులు సతీష్, డి.అజయ్, సూరి పాల్గొన్నారు.

సిపిఎం బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఈ నెల 15వ తేదీ విజయవాడ సింగ్‌నగర్ ఎంబి స్టేడియంలో జరగనున్న సిపిఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కొట్టె కరుణాకరరావు కోరారు. ఆదివారం సుందరయ్య నగర్‌లో వివిధ ప్రాంతాల్లో జరిగిన జనరల్ బాడీ సమా వేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధా నాలకు నిరసనగా ప్రజలు పెద్దఎత్తున ఈ బహిరంగ సభలో పాల్గొనాలని కోరారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపికి



ఎందుకు మద్దతు ఇస్తున్నాయో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. సుందరయ్య మహిళా శాఖ ఆధ్వర్యంలో కూడా గ్రూపు సమావేశాలు జరిగాయి. కార్యక్రమంలో పి.గిరిజ, కె.ఉషారాణి, ప్రభాకర్, ఎస్‌కె బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నో కోర్సులపై అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపిఎస్ కాలేజిలో ఆదివారం ఇగ్నో స్టడీ సెంటర్ లో 2023 జులై సెషన్ సందర్భంగా నూతన విద్యార్థులకు కోర్సుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇగ్నో కోఆర్డినేటర్ ఎ.భానుమురళిధర్ మాట్లాడుతూ ఇగ్నో సెంటర్ సాధించిన విజయాలను వివరించారు. ఇగ్నో సీనియర్ కౌన్సిలర్లు ప్రొఫెసర్ టి.డి.విమల, ఎంఎస్‌సిసిఎఫ్‌టి ప్రోగ్రామ్ గురించి, ప్రొఫెసర్ బివిహెచ్ కామేశ్వరశాస్త్రి మేనేజ్‌మెంట్ కోర్సుల గురించి, డాక్టర్ ఎం.వసంతరావు పిజి కోర్సుల



మాట్లాడుతున్న భానుమురళీధర్

గురించి, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు ప్రాజెక్టుల గురించి, కె.సాంబశివరావు స్పెషల్ ఇంగ్లీషు కోర్సుల గురించి, యం.పూర్ణచంద్రరావు అసైన్‌మెంట్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.దేవేంద్రగుప్త, వై.మార్కండేయులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు సకాలంలో గృహ నిర్మాణాలు చేపట్టాలి



ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం పేదలకు జగనన్న లేఔట్లలో మంజూరు చేసిన నివేశనా స్థలాల లబ్ధిదారులు సకాలంలో గృహ నిర్మాణాలు చేపట్టాలని తెనాలి హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్ కోరారు. హౌసింగ్ డే కార్యక్రమాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని నిడుబ్రోలులో, మండలంలోని పెదపాలెం గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. జగనన్న లేఔట్లలో స్థలాలు పొందిన లబ్ధిదారులు డిసెంబరు నెల ఆఖరిలోగా పక్క గహాలు నిర్మాణం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పక్కా గహానికి లక్ష 80 వేల రూపాయలుతో పాటు సిమెంటు, స్టీలు సబ్సిడీ ధరలకు అందజేస్తు న్నారన్నారు. అలాగే డ్వాక్రా గ్రూపు మహిళలకు తక్కువ వడ్డీ పై 35 వేల రూపాయలు అందజేస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిరుపేదలకు సొంతింటి కల నిజం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నివేశన స్థలాల పంపిణీ చేయడం జరిగిందన్నారు. జగనన్న లేఔట్లలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, అన్ని సౌకర్యాలు వసతులు కల్పించడానికి సన్నాహాలు చేస్తున్నారన్నారు.

నిడుబ్రోలు, పెద్దపాలెం గ్రామాల్లోని జగనన్న లేఅవుట్ లోని లబ్ధిదారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి ఆయన దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు హౌసింగ్ డి ఈ మోహన్ రావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, వర్క్ ఇన్స్పెక్టర్ కుమారి, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-మేడికొండూరు



పురుగు మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సిరిపురంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఈ సంఘటనపై మేడికొండూరు సిఐ కె.వాసు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన కళ్లకుంట సాగర్ బాబు(30)గత కొన్ని రోజులుగా మతిస్థిమితం లేకుండా వ్యవహరిస్తూ నాలుగు ఐదు సార్లు ఎలుకల మందు గతంలో తిన్నాడు.గురువారం సాయంత్రం ఐదు గంటలకు సమయంలో గడ్డి మందు శీతల పానీయంలో కలుపుకొని తాగాడు.అదేరోజు రాత్రి 11 గంటల సమయంలో వారి బంధువులకు గడ్డి మందు తాగిన విషయం తెలియపరచగా,వెంటనే బంధువులు గుంటూరు సమగ్ర ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. ఆదివారం రాత్రి చికిత్స పొందుతూ సాగర్ బాబు మరణించాడు.మతునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు.మతుడు తల్లి సామ్రాజ్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

యువకులపై కేసు నమోదు

ప్రజాశక్తి-తెనాలి :

ప్రజలకు ఇబ్బంది కలిగిస్తూ బహిరంగంగా మద్యం సేవిస్తున్న వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం రోజువారి తనిఖీలలో భాగంగా రూరల్ గ్రామ కొలకలూరు , నందివెలుగులో పోలీసులు ఆదివారం పెట్రో లింగ్ నిర్వహించారు. ఆ సమయంలో నందివెలుగు జంక్షన్లోని హెూటల్స్ వద్ద, కొలకలూరు శివారులో బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఆరుగురు వ్యక్తులను గుర్తించి, వారిపై కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరుపరచనున్నట్లు చెప్పారు. వారికి ఎస్ఐ కౌన్సిలింగ్ నిర్వహించారు.

దాడి ఘటనపై కేసు

ప్రజాశక్తి-తెనాలి: ఓ వ్యక్తిపై దాడి జరిగిన ఘటనపై పట్టణ ఒన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం కొల్లూరు మండలం పెద్ద లంక గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు తన వ్యక్తిగత పనులు నిమిత్తం పట్టణానికి వచ్చాడు. ఈ నేపథ్యంలో చేబ్రోలు మండలం శలపాడుకు చెందిన యార్లగడ్డ శ్రీనివాసరావు బుర్రిపాలెం రోడ్డు లోని రామాలయం సమీపంలో అతనిని కలిశాడు. వారిద్దరి మధ్య నెలకొన్న స్పర్ధలు కారణంగా తోట శ్రీనివాసరావు పై దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యే రోశయ్యకు ధనదాహంతోనే మహా కుంభాభిషేకం

టిడిపి నాయకుల ఆరోపణ

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పెదకాకాని శివాలయంలో కుంభాభిషేకానికి రాజ గురువు స్వరూపానంద స్వామిని తీసుకొని వచ్చి కుంభాబిషేకం నిర్వహించి అధికార పార్టీ నాయకులు అక్రమ వసూళ్లకు పాల్పడటం నిజం కాదా అని పెదకాకాని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ ఆరోపించారు. పొన్నూరు నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తులు ఇచ్చిన ధనాన్ని పూజా కార్యక్రమాలను నిర్వహించేందుకు కాకుండా ఎమ్మెల్యే రోశయ్య దుర్వినియోగం చేశారని ఆరోపించారు. దసరా ఉత్సవాలు నామమాత్రంగా నిర్వహించడం దారుణమన్నారు. రూ.80 లక్షల దేవాలయ నిధులను పంచాయితి రోడ్డు నిర్మాణానికి ఎందుకు ఖర్చు పెట్టారని ప్రశ్నించారు. రూ.50 లక్షల రూపాయల దేవాలయ నిధులను సెం ట్రల్ లైటింగ్ కోసం వాడాల్సిన అవసరమేమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేవస్థాన పాలక మండలి అధ్యక్షుడుగా నేర చరిత్ర కలిగిన వ్యక్తిని నియమించారో నియమిం చారని ఆరోపించారు. ఆలయ ప్రాంగణంలో అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడుతూ,మాంసాహారం వండుతున్నా వారిపై ఎటువంటి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని అన్నారు.

చేబ్రోలు మండల టిడిపి పార్టీ అధ్యక్షులు మైలా వెంకట రామరాజు మాట్లాడుతూ వడ్లమూడి క్వారీ వద్ద గల శ్రీ బాలకోటేశ్వరస్వామి వారి శివలింగం పునరుద్ధరణకు అనుమతి లేకుండా చందాలు వసూళ్ళు చేస్తుంటే, అనువంశక ధర్మకర్తలు కోర్టుకు వెళ్ళిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మహాశివరాత్రి సందర్భంగా దేవాలయాల్లో పూజలు నిర్వహించాల్సిన పూజారులను దేవాలయంలో ఉండనివ్వకుండా వారిని అమానుషంగా అవమానించి బయటకు ఎందుకు పంపారో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. దేవాలయ అభివద్ధి కమిటీ పేరుతో ఒక ప్రైవేట్ కమిటీని వేసి లక్షలాది రూపాయల చందాల రూపంలో వసూలు చేశారని, ఆ డబ్బు ఏమైందని ప్రశ్నించారు. క్వారీ భూముల్లో మైనింగ్ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యేపై ఆరోపణలు చేశారు. పొన్నూరు పట్టణ టిడిపి పార్టీ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ పొన్నూరు శ్రీ సాక్షి భావన్నారాయణ స్వామి వారి మహా కుంబాభిషేకం పేరుతో అధికార పార్టీ నాయకులు అక్రమ వసూళ్లకు తెరలేపారని ఆరోపించారు. ఆటోనగర్ పేరుతో శ్రీ సాక్షి భావనారాయణ స్వామి భూములు కాజేయాలని చూశారని విమర్శించారు. పొన్నూరు మండల టిడిపి అధ్యక్షులు బండ్లమూడి బాబురావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎక్కడా లేనివిధంగా ఆలయ ధర్మకర్తల మండలి బోర్డు సభ్యురాలిగా ఆయన భార్యను నియమించుకొని ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని, , ప్రశ్నించిన వారిని బెదిరిస్తున్నారని ఆరోపించారు.



ఓటర్ల జాబితా సవరణలను పరిశీలిస్తున్న ఆర్డిఇ ఎం.శేషిరెడ్డి

ఓటర్ల జాబితా సవరణల్లో లోపాలు రానివ్వొద్దు

ప్రజాశక్తి-రొంపిచర్ల

ఓటర్ల జాబితాలో ఉన్న సవరణలలో లోపాలు లేకుండా చూడాలని ఆర్డిఒ ఎం.శేషిరెడ్డి ఆదేశించారు. మండలంలోని మునమాకలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల లోని పోలింగ్ బూత్ నెం. 55,56 లలో, విప్పర్లపల్లిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్ నెం. 56,57లలో ఆదివారం ఓటర్ల జాబితాలో సవరణల పరిశీలన కార్యక్రమం జరిగింది. ఆర్డీఓ మాట్లాడుతూ ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని, జీరో డోర్ నంబరు, ఒకే ఇంటి నంబరుతో ఉన్న పదికి మించి ఓటర్లుగా నమోదైన వారి వివరాలను, ఆయా ఇళ్ళకు వెళ్లి పరిశీలించాలని చెప్పారు. వీటి సవరణలకు ఫారం-8, చనిపోయిన ఓటర్లను తొలగించేందుకు, కుటుంబసభ్యుల నుండి ఫారం-7, అర్హత గల ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేసేందుకు ఫారం-6 తీసుకోవాలని చెప్పారు. శాశ్వతంగా నివాసం ఉండని ఓటర్లను గుర్తించి ఫార్మేట్ బిబి, డబుల్ ఓట్లు వారిని గుర్తించి ఫార్మేట్-ఎలో పొందుపరచాలని ఆదేశించారు. పోలింగ్ బూత్ అధికారులు వీటిపై అశ్రద్ధ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తహశీల్దారు జి .అంకారావు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాల్లో తనిఖీ

ప్రజాశక్తి - యడ్లపాడు

స్థానిక లూథరన్ ఉన్నత పాఠశాలలోని సీరియల్ నెంబరు 87-95 వరకు గల పోలింగ్‌స్టేషన్‌లను చిలకలూరిపేట నియోజకవర్గం ఎన్నికల అధికారి వసంతబాబు ఆదివారం తనిఖీ చేశారు. బూత్ లెవెల్ అధికారులను అడిగి స్పెషల్ క్యాంపు వివరాలను తెలుసుకున్నారు. ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండి ఓటర్లకు, ప్రజలకు సేవలు అందించాలని అన్నారు.



26న రజక ఆత్మగౌరవ మహాసభ

ప్రజాశక్తి-అమరావతి

ఈ నెల 26న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వద్ద జరిగే రజక ఆత్మగౌరవ మహాసభను విజయవంతం చేయాలని ఐక్యవేదిక కన్వీనర్ వాడపర్తి పుల్లా రావు పిలుపు నిచ్చారు. మండల కేంద్రమైన అమరావతిలోని రజక బజారులో రాష్ట్ర రజక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లక్షమంది రజకులతో ఈ మహాసభ జరుగుతుందని చెప్పారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, వారికి చట్టసభలలో రిజర్వేషన్ కల్పించాలని కోరారు. అనంతరం మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించి, పురవీధుల ర్యాలీని చేపట్టారు. కార్యక్రమంలో రజక నేతలు, రజక యువ నాయకులు పాల్గొన్నారు.

సరిపడా ఇసుక ఉచితంగా ఇవ్వండి

ప్రజాశక్తి-క్రోసూరు

సిపిఎం ప్రజా రక్షణ భేరి కార్యక్రమం ఐదో రోజు మండలంలోని పెరికపాడు, దొడ్లేరు, అనంతవరం, విప్పర్లలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు మాట్లాడుతూ పెరిగిన ధరల కారణంగా జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణం పేదలకు భారంగా మారిందని అన్నారు. ఈ కాలనీలో ఇంటి నిర్మాణం నిమిత్తం ఇస్తున్న నాలుగు ట్రక్కులు ఇసుక చాలక అదనంగా మరో నాలుగు టక్కులు అవసరం పడుతోందని, ఒక్కో ట్రక్కు కు రూ.5000 నుండి రూ.7000 వరకు అదనంగా ఇచ్చి కొనుగోలు చేయాల్సి వస్తోం దని అన్నారు. జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణానికి సరిపడా మొత్తం ఇసుక ఉచితంగా ఇవ్వాలని, ఒక్కో ఇంటి నిర్మా ణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మండలంలోని తాళ్లూరు, అనంతవరం, విప్పర్లలోని గోవిందపురం జగనన్న కాలనీలో ఒక్క ఇల్లు కూడా పూర్తి చేయలేదని అన్నారు. ఇల్లు కట్టించి ఇస్తామన్న జగన్ హామీని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు గ్రామాల్లో ఇంటింటికి కుళాయి పథకం ప్రచారానికే పరిమితమైందని విమర్శించారు. కుళాయిలు ఏర్పాటు చేసేందుకని పగలగొట్టిన సిమెంట్ రోడ్లను బాగు చేయలేదని, కుళాయిల ద్వారా సరిగ్గా తాగునీరు రావడంలేదని అన్నారు. సరిగా తాగునీరు అందే విధంగా అధి కారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి టి.హనుమంతరావు, ఎ.ఆంజనేయులు, ఏపూరి వెంకటేశ్వర్లు, ఎం.పౌలు,సిహెచ్ యేషయ్య, జి.మహేష్, డి.నటరాజ్ పాల్గొన్నారు.



విప్పర్లలోని జగనన్న కాలనీలో సిపిఎం నాయకులు

కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 15వతేదిన విజయవాడలో జరిగే ప్రజా రక్షణ భేరి బహిరంగసభను, ఈ నెల 7 వతేదిన సత్తెనపల్లిలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం ముప్పాళ్ల మండల కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా మాదలలో ఆదివారం కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బాలకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసి , అధికార పీఠాన్ని కాపాడుకునేందుకు పాకులాడుతున్నాయని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు పెరిగి పోయాయని, పేదలు ఏదీ కొనుగోలు చేసే పరిస్థితి లేదని అన్నారు. కార్యక్రమంలో కె.సాంబశివరావు, ఎం. వెంకటరెడ్డి, జి.జాలయ్య, పఠాన్ సైదాఖాన్, సిహెచ్ నాగమల్లేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, టి.బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాదలలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

అంగన్వాడీ సమస్యల పరిష్కారానికి మరో పోరాటానికి సిద్ధం కావాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పుతుంబాక భవన్ లో జరిగిన సత్తెనపల్లి ప్రాజెక్టు కమిటీ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి ఎస్ .అహల్య అధ్య క్షత వహించారు. మల్లేశ్వరి మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లకు ప్రభుత్వం ఇస్తున్న అరకొర బిల్లులలో పై అధికారులు పర్సంటేజీలు ఇవ్వమని డిమాండ్ చేయడం అన్యాయమని, ఈ పద్ధతులను వ్యతిరేకించాలని అన్నారు. అంగన్వాడీ సెంటర్లకు ఫీడింగ్ లేకపోయినా ఫీడింగు తర్వాత ఇస్తామని ఎఫ్ఆర్ఎస్ యాప్‌లలో పెట్టాలని డిమాండ్ చేయడం సబబు కాదన్నారు. రాష్ట్రంలో ఎఫ్ఆర్ఎస్ యాప్‌లను అనేక జిల్లాలో వ్యతిరేకిస్తున్న పల్నాడు జిల్లాలో అధికారులు బలవంతంగా పనిచేయిస్తున్నారని చెప్పారు. ఇటీవల నిర్వహించిన పౌష్టికాహార వారోత్సవాల్లోనూ, జగనన్న సురక్ష కార్యక్రమంలోనూ అంగన్వాడీలే ఖర్చులు భరిస్తూ చేత వంటలు చేయించి స్టాల్స్ పెట్టించడం, ఈవెంట్స్ చేయించిన విషయాన్ని ప్రస్తావించారు. అంగన్వాడీలకు వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ట్రెజరర్ ఎఎల్ ప్రసన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశ్వరి

8న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

- విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యమం
- కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి
- పోస్టర్ ఆవిష్కరణలో విద్యార్థి, యువజన సంఘాలు


ప్రజాశక్తి-చిలకలూరిపేట

కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ,విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఈ నెల 8 వ తేదీన తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయాలని విద్యార్థి, యువజన నాయకులు ఆదివారం పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక పండరీ పురంలోని ఏలూరి సిద్దయ్య విజ్ఞాన భవన్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐవైఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభా నీ,ఎస్.ఎఫ్.ఐ డివిజన్ కార్య దర్శి సిద్దు, గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్య క్షులు శ్రీను నాయక్, ఎన్ఎస్‌యుఐ పట్టణ అధ్యక్షులు బాషా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కారు స్వప్న కుమార్, మాట్లాడుతూ అనేక త్యాగాలతో, విద్యార్థి యువజన నాయకులు 32 మంది ప్రాణ త్యాగాలతో, వామపక్ష ఎమ్మెల్యేల, ఎంపిల పదవి త్యాగంతో ఏర్పాటైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూను కోవడాన్ని నిరసిస్తూ జరుగుతున్న పోరాటం నవంబర్ 8 నాటికి వెయ్యి రోజులు పూర్తి అవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా అన్ని విద్యార్థి యువజన సంఘాల ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొనడంతో పాటు నవంబర్ 8వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌కు పిలుపు నిచ్చారు. లాభాలు వస్తున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయాలన్న ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫ్యాక్టరీకి అనుబంధంగా ఇనుము, గనులు కేటాయించక పోవడం సిగ్గు చేటన్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా ల క్షలాది మందికి ఉపయోగపడుతున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేస్తామని చెప్పారు. రాయల సీమ ప్రాంతం కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని విభజన చట్టంలో పేర్కొన్న హామీ ఇంతవరకు అమలు చేయలేదని విమర్శించారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అయితే లక్షలాది మంది నిరు ద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తా యని చెప్పారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా, వెనుకబడిన ప్రాం తాల అభివృద్ధికి నిధులు ఇవ్వక కపోవ డంతో పాటు నూతన పరిశ్రమలు ఏర్పాటు వంటి విభజన హామీలను నిర్లక్ష్యం చేస్తున్న మోడీని రాష్ట్రంలోని బిజెపి నేతలు ఎందుకు అడగడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి స్థానిక యువతికి ఉపాధి కల్పిం చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. నవంబర్ 8న రాష్ట్ర వ్యాప్తంగా కేజీ టు పీజీ వరకు జరిగే విద్యా సంస్థల బంద్ కు ప్రతి ఒక్కరూ మద్దతు తెలిపి సహ కరించాలని పిలుపు నిచ్చారు. కార్య క్రమం లో సిఐటియు మండల కన్వీనర్ పేరుబోయిన వెంకటేశ్వర్లు, రైతు సంఘం కార్యదర్శి బొల్లు శంకరరావు, సిఐటియు నాయకులు పి.శ్రీనివాసరావు బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. విద్యార్థి సంఘాల నాయకులు ప్రత్తిపాటి శశికుమార్, ఈశ్వర్, కుమ్మరి చంద్ర పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో విద్యార్థి, యువజన,ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



ఉల్లి నేల నెర్రెలు

పైరుకు మెలికల తిరుగుడు తెగులు - దిగుబడులపై తీవ్ర ప్రతికూల ప్రభావం

ప్రజాశక్తి-తాడేపల్లి

ఈ ఏడాది ఉల్లి పంట వేసిన రైతుల పరిస్థితి నిరాశాజనకంగా ఉంది. పైరుకు మెలికల తిరుగుడు తెగులు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తెగులు వస్తే ఉల్లి కాయ కట్టదు. భూమి పైభాగం ఉండే ఉల్లి చివర్లు మెలికలు తిరిగి ఎండినట్లు పంట పాడైపోతుంది. భూమి లోపల పాయ ఎదగనీయకుండా తినేస్తుంది. ఈ ప్రాంతంలో సహజంగా ఉల్లి ఎంతో మక్కువగా రైతులు పండిస్తున్నా ఈ ఏడాది ఉల్లి మీద ఆశలు ఆవిరవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

నిన్న మొన్నటి దాకా రూ.20 కిలో అమ్మిన ఉల్లి ఆదివారం ఒక్కసారిగా రూ.65కు చేరుకుంది. పంట చేతి కొచ్చే సమయానికి ఈ రేటు ఉంటుందా? ఉండదా? అని రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఎకరానికి రూ.లక్షల పెట్టుబడి పెట్టారు. తీరా పెట్టిన ఖర్చులయినా వస్తాయా? రావా? అనే సందిగ్ధతలో రైతులున్నారు. ఈ ప్రాంతానికి రాజధాని రాక ముందు ఉండవల్లి, పెనుమాక, కృష్ణాయపాలెం, ఎర్రబాలెం తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో ఉల్లి పంట వేసేవారు. రాజధానిగా ప్రకటించిన తరువాత భూముల రేట్లన్నీ కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. 90 శాతం మంది రైతులు తమ భూముల పూలింగ్‌లో ఇవ్వడంతో వ్యవసాయానికి ఆ భూములు దూరమయ్యాయి. ప్రస్తుతం 250 ఎకరాల్లోపు మాత్రమే ఉల్లి పంట వేశారు. చెన్నై దగ్గర తిరుపూర్ నుంచి ఉల్లి 'పాయ' తెచ్చి ఇక్కడ నాటే పద్ధతిని అవలంబిస్తున్నారు. ఎకరానికి ఆరు బస్తాలు పాయ పండుతుందని, విత్తనం కోసమే రూ.27 వేలు ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు.

వాతావరణంలో మార్పుల వల్లే



వాతావరణంలో వచ్చిన మార్పుల వల్లే పెనుమాకలో భూమి నెర్రలిచ్చింది. 30 అడుగుల్లో నీరు సమృద్ధిగా ఉండి సారవంతమైన భూములు కూడా వేసవిలో మాదిరి నెర్రలిచ్చి నోళ్ళు తెరిచాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఇలాంటివి తామెప్పుడూ చూడలేదు. దీనిపై శాస్త్రవేత్తలు పరిశీలించి కారణాలను నిర్ధారించాలి. లేకుంటే తాము తరచూ నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

ఎస్‌కె పీరూసాహెబ్, కౌలు రైతు.

మోడీ పాలనలో ప్రజలపై భారాలు : సిపిఎం

15న విజయవాడలో నిర్వహించే ప్రజారక్షణభేరి బహిరంగ సభ జయప్రదం కోసం ప్రచారం



గుంటూరు ప్రచారంలో మాట్లాడుతున్న ముత్యాలరావు

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై ఈనెల 15న విజయవాడలో సిపియం తలపెట్టిన ప్రజారక్షణ భేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ పార్టీ నగర కమిటీ చేపట్టిన ప్రచార కార్యక్రమం నగరంలో కొనసాగుతోంది. ఆదివారం ప్రగతినగర్, గోరంట్ల, నగరాలు, హిమనీ నగర్, రెడ్డిపాలెం, సంజీవయ్య నగర్, శివనాగరాజు కాలనీ, శారదాకాలనీలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు కరపత్రాలు, సభల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.ముత్యాలరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల హక్కులను కాలరాసే విధంగా పరిపాలిస్తోందని, ప్రజలపై రకరకాల భారాలు మోపుతోందని మండిపడ్డారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీల అమలు చేయకుండా తీవ్రంగా మోసం చేసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతోందని, త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. మరోవైపు రాష్ట్రంలో అధికార పార్టీ కేంద్ర ప్రభుత్వ విధానాలకు అడుగులకు మడుగులొత్తుతోందన్నారు. ప్రధాన ప్రతిపక్షాలు కూడా బిజెపికి సాగిలపడుతున్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తేవటానికి సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రలు చేస్తున్నామని, యాత్రల ముగింపు సందర్భంగా 15న విజయవాడలో భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ సభలో అన్ని రంగాల ప్రజలంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, జిల్లా కమిటీ సభ్యులు ఎంఎ చిష్టి, నగర నాయకులు కె.శ్రీనివాసరావు, షేక్ ఖాశింవలి, ఎ.నికల్సన్, పి.శ్రీనివాసరావు, షేక్ సమీర్, నరసింహ, యశ్వంత్, దీవెనరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

15న విజయవాడలో జరిగే ప్రజారక్షణ భేరి భహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలోని మూడో వార్డులో కరపత్రాల పంపిణీ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్-ఎస్ చెంగయ్య మాట్లాడుతూ దేశానికి వినాశనకరంగా మారిన బిజెపి విధానాలను సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపిని రాష్ట్రంలో ఉన్న అధికార వైసిపి, ప్రతిపక్ష పార్టీలైన టిడిపి, జనసేన మద్దతు పలకడం దారుణమన్నారు. వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో అభివృద్ధి జరగకుండా అడ్డుకుందని, విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచిందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.బాలాజీ, ఎస్.గణేష్, ఎస్.వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

మండలంలోని నంబూరులోని సుందరయ్య కాలనీలో ప్రచారం చేశారు. సిపిఎం మండల కార్యదర్శి ఎస్.శివాజి మాట్లాడారు. డివి. నరసింహారావు, కె.సుబ్బారావు, సాంబయ్య, యేసు, దానేలు, శేషగిరిబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తెనాలి

ఈ నెల 9న తెనాలి అన్నాబత్తుని పుర వేదికకు చేరనున్న ప్రజారక్షణభేరి బస్సు యాత్రకు ఘన స్వాగతం పలికి బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్ కోరారు. ప్రజారక్షణ భేరిపై ఆదివారం చినరావూరు డొంకలోని ఎరుకల కాలనీలో ప్రచారం చేశారు. నాయకులు షేక్ హుస్సేన్ వలి తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి



తెనాలి



పెదకాకాని మండలం నంబూరు





గుండిమెడ శ్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని గుండిమెడలో దళిత శ్మశాన వాటికను శుభ్రం చేయాలని, సిపిఎం నాయకులు పి.కృష్ణ కోరారు. ఈ మేరకు డివైఎఫ్ఐ నాయకులు పి.భార్గవ్‌తో కలిసి దళిత శ్మశాన వాటికను ఆదివారం పరిశీలించారు. ముళ్ల చెట్లు పెరిగి, అడవిని తలపించే విధంగా శ్మశాన వాటిక ఉందని, ఖననం చేయాలంటే ఇబ్బందులు పడే పరిస్థితులున్నాయని, ఇలాంటి అనుభవమే ఇటీవల ఒ మహిళ చనిపోయిన సందర్భ:లో ఎదురైందని చెప్పారు. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు శుభ్రం చేసినా మున్సిపల్ కార్పొరేషన్ అయిన తర్వాత అసలు పట్టించుకోవడం లేదని అన్నారు. ముళ్ల చెట్లు అధికంగా పెరగడంతో శ్మశాన వాటికలోని సిసి రోడ్డు సైతం కనిపించడం లేదన్నారు. అధికారులు సత్వరమే స్పందించి సత్వరమే జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని కోరారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

ఓటరు జాబితాను అందుబాటులో ఉంచండి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పెదనందిపాడు : మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఆర్‌డిఒ శ్రీకర్ ఆదివారం పరిశీలించారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానున్నదని అధికారులు సంసిద్ధులై ఉండాలని చెప్పారు. ఓటర్ నమోదు ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని, ఓటర్ లిస్టులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ షేక్ మహబూబ్ సుభాని, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనచోదకులపై పోలీసుల దృష్టి

ప్రజాశక్తి-మంగళగిరి :యువకులు, మైనర్లు ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్ చేయడం, లైసెన్సులు లేకుండా బైక్‌లు నడపడం, సైలెన్సర్లు తీసివేసి పెద్ద పెద్దగా సౌండ్ చేయడం వంటివి విపరీతంగా జరుగుతున్నాయని ప్రజల నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అర్బన్ సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో గత వారం రోజుల నుంచి పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నారు. సీఐ అర్బన్ పరిధిలో తిరుగుతూ ఆయా సెంటర్లలో ప్రత్యేక డ్రైవ్ చేస్తూ యువకులను, మైనర్లను అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇస్తున్నారు. నిబంధనలు మీరితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలిచ్చే వారికి, మైనర్ల తల్లిదండ్రులకు కూడా మీడియా ద్వారా సిఐ సూచనలను, హెచ్చరికలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం సాయంత్రం మంగళగిరి పాత బస్టాండ్ సెంటర్లో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్లను, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న యువకులను, లైసెన్స్ లేని వారిని అదుపులోకి తీసుకున్నారు. అర్బన్ పరిధిలో నిబంధనకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాలు నడుపుతూ ప్రజలకు ఇబ్బందులను కలుగజేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.



దళితుడిపై దాడి అమానుషం : టిడిపి

ప్రజాశక్తి - వినుకొండ

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎపిలో దళితులపై దాడులు పెరుగుతూ వచ్చాయని టిడిపి దళిత సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశాలతో వినుకొండ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం దళిత సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి అనంతరం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన దళిత యువకుడు శ్యామ్ కుమార్ ను కొంత మంది దుండగులు కిడ్నాప్ చేసి చిత్రహింసలు పెట్టి దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడికి పాల్పడ్డ వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.దళితులపై దాడులను ఆపకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దాసరి కోటేశ్వరరావు, పల్లమీసాల దాసయ్య, పాలపోగు బాలగురవయ్య, మేరాజోత్ హనుమా నాయక్, గర్నెపూడి ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రాష్ట్రంలో దళితులపై వైసిపి నాయకుల అరాచకాలకు నిరసనగా సత్తెనపల్లి పట్నంలోని తాలూకా సెంటర్లో



అంబేద్కర్ విగ్రహంవద్ద టిడిపి నియోజకవర్గ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. టిడిపి పార్లమెంటు జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి అంకాళ్ళ ప్రభుదాస్ మాట్లాడుతూ కంచికచర్ల శ్యాం కుమార్ పై వైసిపి నాయకులు దాడి దారుణమన్నారు.



ప్రజాశక్తి-ప్రత్తిపాడు

దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చాక అదే దళితులను వంచించే కార్యక్రమానికి ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారు అని తెలుగుదేశం పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి. రామాంజ నేయులు విమర్శించారు. దళితులపై దాడులను నిరసిస్తూ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కం,జగజ్జీవన్ రావు విగ్రహాలకు విగ్రహాలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు డి.భాగ్యారావు, మండల టిడిపి అధ్యక్షుడు జి.శివరాం ప్రసాద తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ - 2024 లో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ. శ్యాం ప్రసాద్ నరసరావుపేట మండలంలోని రావిపాడు గ్రామంలోని వెంగల్‌రెడ్డినగర్, మండల పరిషత్ ప్రాథమి కోన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్ నెం.70, 71, నరసరావుపేట పట్టణం రామిరెడ్డిపేట కాశీరత్నం పాఠశాలలోని పోలింగ్ బూత్ నెం.140,144, 146, 147, 151 లను ఆదివారం పరిశీలించారు. గత నెల 27న ప్రచురితమైన ముసాయిదా ఓటర్ల జాబితాతో పాటుగా సంబంధిత బూత్ స్థాయి అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 9.00 గంటల సాయంత్రం 5.00 గంటల వరకు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి జీరో డోర్ నెంబరు, ఒకే ఇంటి నెంబరుతో పదికి మించి ఓటర్లుగా నమోదైన వారి వివరాలను ఆయా ఇళ్ళకు వెళ్లి పరిశీలించి తగిన సవరణల కోసం ఫారం-8 పూర్తి చేయాలన్నారు. చని పోయిన ఓటర్లను తొలగించడం, కుటుంబ సభ్యుల నుండి ఫారం-7 పూర్తి చేయా లన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరిని ఓట రుగా నమోదు చేసేందుకు ఫారం-6 తీసుకొని తక్షణమే విచారణ చేసి నివేదిక సంబంధిత ఎఇఆర్‌ఒలకు ఇవ్వాలన్నారు. శాశ్వత నివాసం ఉండని ఓటర్లను గుర్తించి ఫార్మేట్-బి లోను, డబుల్ ఓట్లు గల వారిని కూడా గుర్తించి ఫార్మేట్ - ఏ లోను నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు ఆయా విషయాలపై అశ్రద్ధ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెంగల్ రెడ్డినగర్ లో ఒకే డోర్ నెం. 220-2 లో ఉమ్మడి కుటుంబంగా ఉన్న 11 మంది ఓటర్లు మందుల జగన్నాథం ఇంటిని జాయింట్ కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. వచ్చే నెల 2,3 తేదీలలో జరగనున్న ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని సూచించారు. నరసరావుపేట మండల తహశీల్దార్ ఆర్‌వి రమణ నాయక్, మునిసిపల్ కమిషనరు రామ్మోహన్, ఆయా రాజకీయ పార్టీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు పాల్గొన్నారు.


ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

రైతులకు తక్షణం నష్టపరిహారం చెల్లించండి



సమావేశంలో మాట్లాడుతున్న అలెగ్జాండర్ సుధాకర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వర్షాలు లేక, సాగు నీరు లేక పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి డిసిసి పల్నాడు జిల్లా అధ్యక్షులు అలెగ్జాండర్ సుధాకర్ అధ్యక్షత వహించారు. మస్తాన్‌వలి ముఖ్య అతిథిగా పాల్గొని ఆంధ్ర ప్రదేశ్ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రసంగించారు. రాష్ట్రంలో రైతులు, రైతు కూలీలు పనులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ రైతాంగ సమస్యలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని విమర్శించారు. నాగార్జున సాగర్ అయకట్టులో పెట్టుబడులు పెట్టి,న రైతులు, కాల్వల్లో నీళ్లు రాక, వర్షాలు లేక బోర్లు ఎండిపోయి ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో 101 మండలాలు మాత్రమే కరువుతో అల్లాడిపోతున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించడంపై విమర్శలు చేశారు. ప్రకటించారన్నారు. అలెగ్జాండర్ సుధాకర్ మాట్లాడుతూ రైతు పక్షపాతి ప్రభుత్వం వైసిపి అంటూ ఓవైపు ప్రచారం చేసు కుంటూనే రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేశారని దుయ్యబట్టారు. రైతు సంక్షేమానికి వ్యవసాయ రంగంలో గిట్టుబాటు ధరలు కాంగ్రెస్ ద్వారానే సాధ్యమని గతంలో నిరూపితమైందని అన్నారు. సమావేశంలో రాష్ట్ర సేవాదళ్ ప్రెసిడెంట్ యలమందారెడ్డి ,ఏపీపీసీసీ జనరల్ సెక్రటరీ రాదాకష్ణ, జిల్లా నాయకులు ఎస్ ఎమ్ బాషా, సీదాకృష్ణ, నాగేంద్ర, దార్లరాజు,గురజాల నాయకులు వేములు శ్రీను ,నరసింహారావు, జర్నలిస్ట్ లలితకుమారి, బీసీ సెల్ పూర్ణ, చిలకలూరిపేట నాయకులు ప్రసన్న గోవిందు శంకర్ ,అనిల్ మాజీ కౌన్సిలర్ కరీమూన్, భవాని వెంకటేష్, సత్యం ,రవి కిషోర్,ప్రేమ్,భరత్ కాల్విన్,కొండ పాల్గొన్నారు.

పిల్లల చదువుల్లో. తల్లిదండ్రుల పాత్ర కీలకం

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

పిల్లల చదువుల పట్ల ఉపాధ్యాయుల పర్యవేక్షణతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకమని ప్రముఖ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణులు విద్యావేత్త యండమూరి వీరేంద్రనాథ్ అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట ప్రకాష్ నగర్ లోని భువనచంద్ర టౌన్ హాల్లో ఆదివారం ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సుకు యండమూరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యండమూరి మాట్లాడుతూ పిల్లలను వారి తల్లి దం డ్రులు గారాబం చేయకుండా, వారితో ప్రేమగా మెలుగు తూనే చదువు ప్రాముఖ్యతను వివరించాలన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివేలా ప్రోత్సహించాలన్నారు. చదువు చాలా బాగుంటుందని, ఉన్నత చదువులతో ఉద్యోగ భవిష్యత్తు ఉంటుందని వారికి తెలియజేయాలన్నారు. విద్యార్థుల చేతిరాత కూడా బాగుండేలా చూడాలని సూచించారు. 'డబ్బు లేక పోతే జీవితంలో పైకి రాలేరు' అనే నానుడి తప్పని, చదువు ద్వారా జీవితంలో ఎంతో ఎత్తుకు ఎదిగిన వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులను తీర్చిదిద్దాలని యాజమాన్యాన్ని కోరారు. అనంతరం ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కార్యదర్శి డాక్టర్ నాగోతు ప్రకాశరావు మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో అధునాతన మౌలిక వసతులతో ఏర్పాటు చేసిన తమ స్కూల్ లో అపార అనుభవం గల ఉపాధ్యాయ బృందంతో విద్యా బోధనను రానున్న విద్యా సంవత్సరం నుండి తమ స్కూల్‌లో ప్రారంభిస్తున్నామని అన్నారు. చదువుతోపాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చేలా అనుభవం కలిగిన వ్యాయామ ఉపాధ్యాయులు విశాలమైన క్రీడా ప్రాంగణం అందుబాటులో ఉంటుందన్నారు. ఐడిపిఎస్ ఎపి హెడ్‌సిహెచ్ ఎ.రామరాజు మాట్లాడుతూ 2 నుండి 9వ తరగతి వరకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించామని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. అవగాహన సదస్సుకు ముందు ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కాలర్‌షిప్ టెస్టుకు పల్నాడు జిల్లా నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు తల్లిదండ్రులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఐడీపీఎస్ జాతీయ ఫ్రాంచైజీ హెడ్ సుభాష్ కలువ, శ్రీ దత్త హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.కృష్ణకాంత్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యండమూరి వీరేంద్రనాథ్



మునుగోటి వెంకట్రావుకు జాతీయ బంగారు నంది అవార్డు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

మండలంలోని గుడిపూడికి చెందిన మునగోటి వెంకట్రావు జాతీయ బంగారు నంది అవార్డు అందుకున్నారు. వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని రవీంద్రభారతిలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంగీతం, సమాజసేవలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ వార్డును ప్రదానం చేసినట్లు అవార్డు గ్రీహీత మునుగోటి వెంకట్రావు తెలిపారు.



ఘనంగా కొమ్మాలపాటి శ్రీధర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- క్రోసూరు

మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు బెయిల్ మీద బయటకు రావడం, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ పుట్టినరోజు సందర్భంగా ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చిలో ఆదివారం కేక్ కట్ చేసినట్లు మండల టిడిపి నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూశ్రీధర్ జన్మదినము సందర్భముగా కాంద్రు కాశయ్యగా కేక్ కట్ చేసినట్లు చెప్పారు.

రెయిలింగ్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



అమరావతి మేజర్ కాల్వ రెయిలింగ్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు ముందుకు దూసు కొచ్చింది. సత్తెనపల్లిలోని అమరావతి మేజర్ కాల్వ వంతెనకు వున్న ఇనుప రైలింగ్ ను ఆర్టీసీ ఎక్స్ ప్రెస్ బస్సు ఢీకొట్టింది ఈ సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. పిడుగురాళ్ల నుండి గుంటూరు వెళుతున్న ఆర్టీసీ ఎక్స్ ప్రెస్ బస్సులో సుమారు 30మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. అతి వేగంగా ప్రయాణిస్తున్న బస్సు ముందు వెళుతున్న వాహనాన్ని తప్పించే క్రమంలో ఈ ఘటన జరిగింది. దీంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలకు ముగిసిన స్పెషల్ క్యాంపెయిన్



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కమిషనర్ పివికె భాస్కర్

ప్రజాశక్తి-గుంటూరు

ఓటర్ల ముసాయిదా జాబితాపై స్పెషల్ క్యాంపెయిన్ రోజుల్లో అందే ఫారాలను వెంటనే పరిష్కరించేలా బిఎల్‌ఓలు శ్రద్ధ చూపాలని నగర ఇన్‌ఛార్జి కమిషనర్ పివికె భాస్కర్ ఆదేశించారు. ఆదివారం నగరంలోని బిఆర్ స్టేడియం, అంజుమన్ స్కూల్, పాత గుంటూరులోని పలు పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న స్పెషల్ క్యాంపెయిన్‌ను ఏఈఆర్‌ఓలు, సూపర్‌వైజరీ అధికారులతో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కమిషనర్ తొలుత ఆయా పోలింగ్ కేంద్రాల్లో బిఎల్‌ఓల హాజరు పరిశీలించి, శనివారం అందిన ఫారాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బూత్‌లకు వచ్చిన ప్రజలతో మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలోని 532 పోలింగ్ బూత్‌లలో శని, ఆదివారాల్లో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకూ స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించారు. క్యాంపుల్లో ప్రజల నుండి నూతన ఓటుకై దరఖాస్తులు, ఓటర్ కార్డులో చిరునామా, పేరు, పుట్టిన తేది తదితర మార్పులకై అందిన దరఖాస్తులను, అభ్యంతరాలను క్రమ పద్ధతిలో రికార్డ్ చేసి, వాటి పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలు కూడా తమ ఓటుపై ఏమైనా అభ్యంతరాలున్నా క్యాంపుల్లో బిఎల్‌ఓల దగ్గర ఉన్న ఓటర్ల లిస్టుని పరిశీలించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఆర్‌ఓలు అదనపు కమిషనర్ (ఇంఛార్జి) సిహెచ్ శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటీప్లానర్ కోటయ్య, సూజర్‌వైజరీ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024 రెండవ రోజులో భాగంగా మంగళగిరి పట్టణ పోలింగ్ స్టేషన్లలో బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉండి దరఖాస్తులను స్వీకరించారు. మంగళగిరి అర్బన్ పరిధిలోని అన్ని



పోలింగ్ కేంద్రాలను పోలింగ్ అసిస్టెంట్ ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, అడిషనల్ కమిషనర్ కె.హేమమాలిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా విడుదలైన ముసాయిదా ఓటర్ల జాబితాలో ఓటర్లు తమ పేరు ఉందో లేదో చూసుకోవచ్చునని, ఏవైనా తప్పులుంటే సరి చేసుకోవాలని కోరారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం 6, ఓట్ల తొలగింపు కోసం ఫారం 7, ఓటరు జాబితాలో మార్పు చేర్పులు, సవరణల కోసం ఫారం 8లను సమర్పించాలని చెప్పారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం



ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

మండల పరిధిలోని తక్కెళ్ళపాడులో శివాలయం వద్ద జరిగిన గుంటూరు జిల్లా యువన జూనియర్, సీనియర్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ 2023-24 పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే డి.నరేంద్రకుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై బహుమతులు అందించారు.

మదుపరుల పొదుపునకు భరోసా

- **గోదావరి ఆంధ్ర కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్**
- **సీనియర్ సిటిజన్లకు ప్రతినెలా వడ్డీ సదుపాయం**
- **రికరింగ్ డిపాజిట్లపై అత్యధిక వడ్డీ**
- **డిపాజిటర్లు, ఖాతాదారులకు ప్రమాదబీమా సౌకర్యం**



ప్రజాశక్తి-తెనాలి

చిన్న మొత్తాలను పొదుపు చేయండి.. పెద్దమొత్తంలో లాభించండి.. మదుపరుల పొదుపునకు భరోసా కల్పిస్తున్నాం.. డిపాజిటర్లకు, ఖాతాదారులకు ప్రమాదభీమా సౌకర్యం కల్పిస్తాం.. ఆరేళ్లలో మీ సొమ్ము రెట్టింపౌతుంది.. సీనియర్ సిటిజన్స్ ప్రతినెలా వడ్డీ పొందే సౌకర్యం, రికరింగ్ డిపాజిట్లు అత్యధిక రాబడితో పాటు, రోజువారి పొదుపు సౌకర్యమూ ఉంది. ప్రారంబించిన రెడేళ్లలోనే నాలుగు బ్రాంబీలకు విస్తరించి, మొత్తంగా 700 మంది ఖాతాదారులతో విజయపథంలో పయనిస్తున్నామని అంటున్నారు గోదావరి ఆంధ్రా కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్ శ్రీనివాస్ తాళ్ళపల్లి.

గోదావరి ఆంధ్ర మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్‌ను స్థానిక గంగానమ్మపేట ఆంజేయ పంతులు వీధి, మహేష్ మాన్షన్ మొదటి అంతస్తులో రెండేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. అనతి కాలంలోనే ఖాతాదారుల సంఖ్యను గణనీయంగా పెంచుకున్నారు. తెనాలితో పాటు మంగళగిరి, వేమూరు మండలం చావలి, గుంటూరులోనూ బ్రాంచీలను ప్రారంభించారు. నరసరావుపేట, సత్తెనపల్లి ప్రాంతాల్లోనూ శాఖల విస్తరణకు ప్రతిపాదించారు. రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపుతోపాటు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల మేరకు నిర్వహిస్తున్న సొసైటీలో జాతీయ బ్యాంకులు, ఇతర కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలకు మించి వడ్డీ రేట్లు ఇస్తున్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 14 శాతం వడ్డీని అందిస్తున్నారు. ఫలితంగా ఆరేళ్లకు పెట్టుబడి రెట్టింపౌతోంది. సీనియర్ సిటిజన్లు తమ డిపాజిట్‌పై నెలనెలా వడ్డీ పొందాలనుకుంటే, ఆరేళ్ల కాలపరిమితికి డిపాజిట్ చేసిన రూ.లక్షపై ప్రతినెలా రూ.1,167 లభిస్తుంది.

శాఖలను విస్తరిస్తున్నాం



మా సొసైటీ ప్రారంభించి రెండేళ్లు పూర్తయ్యింది. సంస్థ తరపున ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. ఖాతాదారుల సంఖ్యనూ దాదాపుగా 700కు పెంచుకున్నాం. వివిధ ప్రాంతాలకు శాఖలను విస్తరిస్తున్నాం.

శ్రీనివాస్ తాళ్ళపల్లి, చైర్మన్, గోదావరి ఆంధ్ర కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, తెనాలి

అత్యధిక రాబడికి రికరింగ్, డెయిలీ డిపాజిట్లు

సంస్థలో రికరింగ్ డిపాజిట్ సౌకర్యం ఉంది. దీనిలో అత్యధిక రాబడి కూడా పొందే అవకాశాన్నీ కల్పిస్తున్నారు. నెలవారి రూ.2వేల చొప్పున రికరింగ్ డిపాజిట్‌లో పొదుపు చేసుకుంటే ఐదేళ్లకు రూ.1.62,207 పొందే సదుపాయం ఉంది. 60 నెలలకు రూ.1.20 లక్షలు పొదుపు చేస్తే రూ.1,62,207 తిరిగి పొందొచ్చు. డెయిలీ డిపాజిట్ కింద కనిష్టంగా రూ.100 నుంచి రోజువారి పొదుపు చేసుకోవచ్చు. రోజుకు కనీసం రూ.500 చొప్పున పొదుపు చేసుకుంటే ఏడాదికి రూ.1,87,512 పొందవచ్చు. అంటే రూ.1.82,500 దాచుకుంటే, దానికి వడ్డీతో కలిపి రూ.1,87,512 పొందవచ్చు. క్రమం తప్పకుండా రెండు నెలలపాటు డిపాజిట్ చేసిన ఖాతాదారులు వారి పొదుపుపై రుణం పొందే సౌకర్యం ఉంది. రికరింగ్ డిపాజిట్లు, డెయిలీ డిపాజిట్లు సేకరించేందుకు ఖాతాదారుల వద్దకు సంస్థ నియమించిన ఏజెంట్లే వస్తారు.

చిరువ్యాపారులకు, గ్రూపులకు రుణాలు

ఇప్పటికే సంస్థ నుంచి దాదాపుగా 300 మంది వ్యాపారాలకు రుణాలు పొందిన నేపథ్యంలో చిరు వ్యాపారుల పెట్టుబడులకు మరింత ప్రోత్సహించే దిశాగా సంస్థ అడుగులేస్తోంది. తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తుంది. గ్రూపుగా సంప్రదిస్తే రుణ సదుపాయం కల్పిస్తుంది. ఈ పథకంలో కిరాణా, వస్త్ర వ్యాపారులు డ్రైక్లీనర్స్, బిల్డింగ్ మెటీరియల్ సప్లయర్స్, పండ్ల వ్యాపారులు, బేకరీ, ఫార్మసీ, పాన్‌షాపు, సెలూన్, టైలరింగ్, ఫ్లవర్ స్టాల్స్ నిర్వాహకులు, కార్పెంటరీ, పెయింటింగ్ మేస్త్రీలు తదితర రంగాల్లో వారు రుణాలు పొందే వీలుంది.

చిన్నారుల భవిష్యత్ కోసం ధన్వి భవిష్య నిధి

చిన్నారుల బంగారు భవిష్యత్ కోసం ప్రవేశపెట్టిన 'ధన్వి భవిష్య నిధి' పథకం అత్యధిక ఆదరణ పొందుతోంది. పిల్లల విద్య, వివాహ అవసరాల కోసం పొదుపు చేసే వారు ఈ పథకాన్ని ఎంచుకోవచ్చు. ఈ పథకంలో రూ.లక్షను 12 ఏళ్ల కాలపరమితికి డిపాజిట్ చేస్తే రూ.4 లక్షలు పొందవచ్చు. రూ.2 లక్షలు డిపాజిట్ చేస్తే, 12 ఏళ్లకు రూ.8 లక్షలు పొందవచ్చు.

డిపాజిటర్లు, ఖాతాదారులకు ప్రమాద బీమా

సంస్థలో డిపాజిటర్లకు, ఖాతాదారులకు ప్రమాద బీమా సౌకర్యం ఉంది. సంస్థలో సేవింగ్స్ ఖాతా ప్రారంభించేందుకు రూ.1000 చెల్లించాలి. అయితే సీనియర్ సిటిజన్లకు రూ.500 చెల్లించి ఖాతా ప్రారంభించే సౌకర్యం కల్పించారు. రూ.లక్షకు పైబడి డిపాటిజ్ చేసిన ఖాతాదారులకు రూ.5 లక్షల ప్రమాదబీమా, సాధారణ ఖాతాదారులకు రూ.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యం ఉంది.



భోజనాలు వడ్డిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు తదితరులు

సమాజ శ్రేయస్సులో జర్నలిస్టుల పాత్ర కీలకం

ఎపి వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫేడరేషన్ 16వ వార్షికోత్సవంలో డీఎస్పీ జనార్ధనరావు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

సమాజ శ్రేయస్సులో జర్నలిస్టుల పాత్ర కీలకమని తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ 16వ వార్షికోత్సవాలను తెనాలిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీశివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కుర్రా శ్రీను ఆధ్వర్యంలో అనాధలకు అన్నదానం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ఫెడరేషన్ తనవంతు సహాయాన్ని అందించడంతోపాటు అన్నార్తుల ఆకలి తీర్చడం అభినందనీయమన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ మహాత్మగాంధీ సేవా శాంతి ఆశ్రమంలో వృద్ధులకు జరిగిన అన్నదాన కార్యక్రమంలో తాలూకా ఎస్ఐ సి.హెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సేవాకార్యక్రమాలు చేస్తున్న ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారిని ఫెడరేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం ఫెడరేషన్ కార్యాలయంలో సీనియర్ జర్నలిస్టులు బచ్చు సురేష్ బాబు, ఎస్ఎస్ జహీర్‌ను ఫెడరేషన్ సభ్యులు సత్కరించారు. ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కె.రత్నాకర్, డివిజన్ కార్యదర్శి డి.కోటేశ్వరరావు, నియోజకవర్గ అధ్యక్షులు అంబటి శ్యామ్‌సాగర్, కార్యదర్శి పుట్ట పున్నయ్య, వేమూరు నియోజకవర్గ అధ్యక్షులు ఎం.సుబ్బారావు, జి.ప్రకాశరావు, అచ్యుత సాంబశివరావు, బి.చంద్రమోహన్, సభ్యులు వి.లక్ష్మణరావు, ఉనం భూషణరావు, మునిపల్లి శ్రీకాంత్, ఎం.ప్రసాద్, డి.రవికిరణ్, అత్తోట సంజయ్, ఎన్‌జె శ్యామ్యూల్, ఎం.భాస్కర్, కరేటి సాంబశివరావు, యు.కోటేశ్వరరావు, దాసరి వెంకటేశ్వరరావు, కె.కృష్ణ, బి.ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిడుముక్కల సర్పంచ్ మాదాసు రత్నకుమారి

నిడుముక్కలలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి - తాడికొండ

ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, సామాజిక విజ్ఞాన కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్)లో భాగంగా నిడుముక్కలలో ఏడు రోజులు ప్రత్యేక శిబిరాన్ని సర్పంచ్ మాదాసు రత్నకుమారి ఆదివారం ప్రారంభించారు. 'మెరుగైన పర్యావరణం కోసం యువత పాత్ర' అంశంపై అవగాహన కల్పించడానికి వివిధ కార్యక్రమాలపై ప్రణాళిక రూపొందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో చేపట్టబోయే కార్యక్రమాలను ఉత్సాహంగా సేవాభావంతో చేయాలని చెప్పారు. సామాజిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.ఎస్.చైతన్య కుమారి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి చేయాల్సిన ప్రణాళికను వివరించారు. అనంతరం గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు సామాజిక సర్వే చేపట్టారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ధనశ్రీ, డాక్టర్ నిర్మలాదేవి, వాలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెఎసి కన్వీనర్ సుమన్

ఉద్యోగులు ఐక్యంగా పోరాడాలి

ప్రజాశక్తి-గుంటూరు

జెఎసి అమరావతి అవుట్‌సోర్సింగ్ విభాగం జిల్లా మహాసభ ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించారు. జెఎసి కన్వీనర్ సుమన్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జెఎసి మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మీ మాట్లాడుతూ ఐక్య పోరాటాతో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎపి జెఎసి అమరావతి జిల్లా కార్యదర్శి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రశ్నించకుండా, పోరాడకుండా హక్కులు సాధించుకోలేమని చెప్పారు. జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు యాభైవేల మందికిపైగా ఉంటే కేవలం 10,117 మందినే క్రమబద్ధీకరించటం సరికాదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి జెఎసి జిల్లా అధ్యక్షులు కె.సంగీతరావు, నాయకులు శిరీష పాల్గొన్నారు.



నూతన కార్యవర్గం

ఎపిజిఇఎ మహిళా విభాగం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎపిజిఇఎ) మహిళా ఉద్యోగుల విభాగం నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం నగరంపాలెంలోని సంఘం జిల్లా కార్యాలయంలో కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలకు జిల్లా ఉపాధ్యక్షులు శ్యాంకుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రటరీ జి.నాగసాయి, మహిళా విభాగం చైర్‌పర్సన్ సుగుణ హాజరయ్యారు. మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎల్.పద్మావతి, కార్యదర్శి యు.సుమిత్రాదేవి, సహాధ్యక్షురాలుగా పి.హేమలత, జిల్లా కోశాధికారిగా శేషుకుమారి, కార్యనిర్వాహక సెక్రెటరీగా రమణ తదితరుల్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులను, జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా, రాష్ట్ర పరిశీలకులు జి.నాగసాయి, సుగుణ సన్మానించారు. మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మావతి, సుమిత్రాదేవి అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కరీముల్లా శాఖాద్రి, ఉపాధ్యక్షులు శ్యామ్‌కుమార్, నగర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, కార్యదర్శి సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

రైతులు, విద్యార్థులకు విరివిగా రుణాలు

- రూ.6048 కోట్లకు పెరిగిన టర్నోవర్
- నాలుగేళ్లలో రూ.30 కోట్ల లాభాల్లోకి జిడిసిసిబి
- ప్రజాశక్తితో బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు

ఇంటర్వ్యూ

ఉమ్మడి గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రస్తుతం రూ.30 కోట్ల లాభాల్లోకి వచ్చిందని బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (రాము) తెలిపారు. గతంలో ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని నష్టాల్లో ఉన్న బ్యాంకు గణనీయంగా పురోగతి సాధించిందని చెప్పారు. వివిధ తరగతుల వారికి రుణాలు ఇస్తున్నామని, వ్యాపార లావాదేవీలు బాగా పెరిగాయన్న ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు తెలిపారు.



బ్యాంకు పురోగతి ఎలా ఉంది?

టిడిపి హయాంలో బ్యాంకు నష్టాల్లో ఉంది. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత క్రమంగా బ్యాంకు అభివృద్ధి దిశలో పయనించింది. 2019లో రూ.7 కోట్ల లాభాలతో ప్రారంభమైన బ్యాంకు ప్రస్తుతం రూ.30.13 కోట్ల లాభాల్లోకి చేరింది. 2019లో షేర్ క్యాపిటల్ కేవలం రూ.114.16 కోట్ల వరకు ఉండగా 2023 అక్టోబరు 31 నాటికి రూ.286.66 కోట్లకు చేరింది. డిపాజిట్లు రూ.861 కోట్ల నుంచి రూ.1332.40 కోట్లకు, వివిధ తరగతులకు రుణాలు రూ.866.59 కోట్ల నుంచి రూ.3258.97 కోట్లకు పెరిగాయి. 2019లో వ్యాపార లావాదేవీలు రూ.2530.66 కోట్లు జరిగాయి. 2019 నుంచి ఇప్పటి వరకు రూ.6048.86 కోట్లకు పెరిగాయి. రాష్ట్రంలో 13 డిసిసిబిల్లో బాగా పురోగతి సాధించిన బ్యాంకుల్లో గుంటూరు జిల్లా రెండో స్థానంలో ఉంది.

ఉమ్మడి జిల్లాలో ఎన్ని పిఎసిఎస్‌లు ఉన్నాయి? రుణాలు పంపిణీ?

167 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పిఎసిఎస్), 42 డిసిసిబి బ్రాంచిలు ఉన్నాయి. వీటిల్లో 9,95,533 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 2,03,151 మందికి రుణాలిచ్చాం. 4,58,915 మంది డిపాజిటర్లు ఉన్నారు. కొత్తగా రైతుల పిల్లలకు విదేశీ చదువులకు కూడా రుణాలిస్తున్నాం. పంట రుణాలు, దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు, ట్రాక్టర్లు కొనుగోలు, గొర్రెలు, మేకలు పెంపకం దారుల, కోళ్లఫారాలకు, చేపల పెంపకం, భూమి అభివృద్ధికి, చిరు వ్యాపారులకు, స్వయం సహాయక సంఘాలు, విద్యార్థులకు రుణాలు ఇస్తున్నాం. బ్యాంకు పనితీరుపై నమ్మకంతో ప్రజలు రూ.1332.40 కోట్ల వరకు డిపాజిట్లు ఉంచారు.

విద్యారుణాలు ఎలా ఇస్తారు?

రైతుల పిల్లలకు విద్యారుణాలు ఇచ్చేందుకు ప్రాధాన్యమిస్తున్నాం. గరిష్టంగా రూ.40 లక్షల వరకు రుణాలిస్తాం. ఇప్పటి వరకు 380 మంది విద్యార్థులకు రూ.81.30 కోట్ల రుణాలు ఇచ్చాం. 662 మంది రైతుల పిల్లలకు విదేశీ విద్యారుణాలు అందించాం. శావల్యాపురం, నరుకుళ్లపాడులో కోల్డ్ స్టోరేజీల నిర్మాణానికి రుణాలిస్తున్నాం. బంగారంపై రుణాలు గతనాలుగేళ్లలో గణనీయంగా పెంచాం. రూ.49.45 కోట్లనుంచి రూ.282.97 కోట్ల వరకు బంగారంపై రుణాలుఇచ్చాం.

బ్యాంకు లావాదేవీలు ఎలా పెరిగాయి?

అన్ని బ్యాంకులు కంప్యూటరీకరణ చేస్తున్నాం. సహకార బ్రాంచీల పరిధిలో 39 ఎటిఎంలు ఏర్పాటు చేశాం. 167 పిఎసిఎస్‌లలో మైక్రో ఎటిఎం సౌకర్యం కల్పిస్తున్నాం. పారదర్శకమైన సేవలను పెంచడం ద్వారా రైతులు, ఇతర వర్గాలకు చెందిన ప్రజల ఆదరణ పెరుగుతోంది. ఎక్కడా అక్రమాలు లేకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నాం. రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే విచారణ జరిపి బాధ్యులైన ఉద్యోగులు, అధికార్లపై చర్యలు తీసుకుంటున్నాం.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరులో విరాట్ కోహ్లీ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



క్రికెట్ సంగ్రామంలో కోహ్లీది ఒక సువర్ణధ్యాయమని క్రీడాభిమానులు అన్నారు. విరాట్ కోహ్లీ పుట్టినరోజుతోపాటు క్రికెట్ వరల్డ్ కప్ టోర్నీలో భాగంగా ఆదివారం కలకత్తాలోని ఈడెన్ గార్డెన్స్ స్టేడియంలో సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ తన 49వ సెంచరీ చేసి సచిన్ టెండుల్కర్ రికార్డును సమం చేసిన సందర్భంగా గుంటూరులోని శ్రీనివాసరావుతోటలో వేడుకలు నిర్వహించారు. కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు ఆళ్ల హరి మాట్లాడుతూ భవిష్యత్ క్రీడాకారులకు విరాట్ కోహ్లీ ఆదర్శనీయమని అన్నారు. కెప్టెన్‌గా భారత్‌కు యాభై శాతం విజయాలు అందించిన ఘనత కోహ్లీదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రపంచ కప్‌టోర్నీ ఇండియా విజేతగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కొండవీడు చరిత్రపై సమాచార బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి-యడ్లపాడు



కొండవీడు కోటలో చారిత్రక, సాంస్కృతిక సమాచారాన్ని తెలియజేస్తూ కోటలో నడిబొడ్డున గ్యాలరీ ఏర్పాటు చేశారు. ఈ గ్యాలరీలో క్రీస్తు శకం 13వ శతాబ్దం నుండి 20వ శతాబ్దం వరకూ జరిగిన చారిత్రక పరిణామాలను వివరిస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. క్రీస్తు శకం 1325 నుండి 1424 వరకూ కొండవీడును రెడ్డిరాజులు రాజధానిగా చేసుకొని పరిపాలించారు. మొదట అద్దంకిని రాజధానిగా రాజ్యపాలన ప్రారంభించి, రెండో రాజధానిగా కొండువీడును రాజధానిగా చేసుకొని బట్టి ప్రోలయ వేమారెడ్డి కొండవీడు కోట నిర్మాణం ప్రారంభించారు. అయితే అతని కుమారుడు అనపోతారెడ్డి నిర్మాణాన్ని పూర్తి చేసి 1353లో రాజధాని అద్దంకి నుండి కొండవీడుకు మార్చారు. ప్రోలయ వేమారెడ్డి నుండి రాచ వేమారెడ్డి వరకూ ఆరుగురు రాజులు కొండవీడు రాజధానిగా కోస్తాంధ్ర ప్రాంతాన్ని పరిపాలించారు. ఈ విషయాలన్నింటినీ క్లుప్తంగా ఈ గ్యాలరీలో పేర్కొన్నట్లు కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి తెలిపారు. ఈ సమాచారం తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ఉంటుందని, కొండవీడు ఘాట్‌రోడ్డు, నగరవనానికి సంబంధించిన బోర్డు కూడా ఏర్పాటు చేశామని అన్నారు. ఘాట్ రోడ్డు ప్రారంభంలో కింద గృహరాజులు సౌధం, జడ్డిగాల బావిని గురించి ఒక బోర్డు ఉంటుందన్నారు. కోట, రాజుల చరిత్ర, సాంస్కృతిక చరిత్రతోపాటు, కొండవీడుకు సంబంధించిన ముఖ్యమైన ఫొటోలూ ఏర్పాటు చేశామన్నారు.

మేఘ గర్జన పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు



స్థానిక జెఐహెచ్ కార్యాలయంలో ఆదివారం ముస్లిమ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో అబాబీల ప్రక్రియలో వర్ధమాన కవయిత్రి ఖుర్షిద్ బేగం రాసిన మేఘ గర్జన పుస్తకావిష్కరణ సభ జరిగింది. కార్యక్రమానికి ప్రముఖ కవి, అబాబీల సృష్టికర్త కవి కరీముల్లా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖకవి భూసురుపల్లి వెంకటేశ్వర్లు, విశిష్ట అతిథిగా నల్లూరి రుక్మిణి, ఆత్మీయ అతిథిగా అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు. మేఘ గర్జన పుస్తకాన్ని భూసురుపల్లి వెంకటేశ్వర్లు ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలోని అనేక సమస్యలపై హృదయానికి హత్తుకునేలా అబాబీల రూపంలో గర్జన చేశారని, చక్కని శైలితో సాగుతున్న కవయిత్రి మరింతగా అధ్యయనం చేసి ముందుకు సాగాలని సూచించారు. రుక్మిణి మాట్లాడుతూ చరిత్రలో ఫాసిజం, మతతత్వం, నాగరికత పరిణామం గురించి వివరించారు. అబ్దుల్ రషీద్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో ముస్లిమ్ రచయితల కృషిని అభినందించారు. విష సంస్కృతిలో కొట్టుకుపోతున్న నేటి సమాజాన్ని ఇస్లామియా వెలుగులో మార్గనిర్దేశం చేస్తూ తమను తాము సంస్కరించుకుంటూ అన్నిమతాల వారితో సామరస్యంగా ముందుకు సాగాలని కవయిత్రి కోరుకోవడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమాన్ని ము.ర.సం రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ హకీం పర్యవేక్షించగా, కార్యదర్శి ఎస్.ఎం.సుభాని, కోశాధికారి బషీర్ గర్తపురి, మీడియా కార్యదర్శి సుభాని నిర్వహించారు. రచయిత్రి ఖుర్షీద్ బేగం అబాబీల ప్రక్రియలో 'మేఘ గర్జన 'రాయడానికి స్ఫూర్తి నిచ్చిన కవి కరీముల్లాకు, ప్రోత్సాహం అందించిన తన భర్తకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఖాజావలి, రహీమ్ సాహెబ్, స్ఫూర్తి సుభాని, జాయద్‌సాబ్, బతుల్ హుమైర్వి పాల్గొన్నారు.